కథానిక

# మాతృత్వం

నిడదవోలు మాలతి

ఆకు నంటిపెట్టికుని గూడు కట్టుకున్న గొంగళిపురుగులా భూదేవిని నమ్ముకుని పడుకున్న ఆ వూరి ప్రజల్లో చలనం కలిగించగలినవి చాలా తక్కువ. ఎలక్షన్ల వంటి ప్రాపంచిక విషయాలూ, బాలయోగులవంటి ఆముష్మిక చింతనలకీ కూడా అతీతులు వాళ్ళు. కళ్ళెదుట ఖూనీ జరిగితేచూసి చుట్ట వెలిగించుకుని వెళ్ళిపోయే జాతి అది. అక్కడ అన్యాయం లేదు ఎందుకంటే అక్కడ ఎవడూ ఎవడినీ కొట్టడు కనక. అక్కడ న్యాయం లేదు ఎందుకంటే ఎవడికైనా దెబ్బ తగిలితే రెండోవాడు కలుగజేసుకోడు కనక. స్వర్గమూ, నరకమూ రెండూ తెలీవు అక్కడివాళ్ళకి.

ఆ స్తబ్ధ జగతిలో కించిత్ చలనం కలిగించింది ఆమె రాక. ఆమె అక్కడికి ఎలా వచ్చిందో ఎందుకు వచ్చిందో ఎవరికీ తెలీదు. ఒకానొక సుప్రభాతాన ఊరు ఆవులించి కళ్ళు విప్పితే ఆమె కనిపించింది. అంతే, "ఎవరు నువ్వు?" అని ఎవరూ అడగలేదు. ఊరు చివర పడిపోయిన పాడు దేవాలయంలో ఆమె పాతచీరె పరుచుకుని పడుకుంటే ఎవరూ కాదనలేదు.

మర్నాడు ఆమె స్నిగ్ధత్వం చూపే కళ్ళతో, చిరునవ్వొలికే వదనంతో వీధిలోకి వచ్చింది, ఆ వీధులలో ఎవరూ కొంపలంటుకుపోతున్నట్టు పరుగులు పెట్టడంలేదు, పనిగట్టుకుని 144వ సెక్షన్ వ్యతిరేకిస్తున్నట్టు రోడ్డుకడ్డంగా సైకిళ్ళు పట్టుకునిలబడి అప్రస్తుతాలు చర్చించే గుంపులు లేవు. ఆమె ముందుకి సాగిపోతూనే ఉంది.

ఒకచోట ఆగింది. అక్కడ ఒక లేగదూడ కాలువలో పడి లేవలేక అవస్థ పడుతోంది. చుట్టూ చూసింది. ఎవరూ ఇది గమనించినట్టు లేదు, తనే వెళ్ళి మెల్లిగా దాన్ని లేవదీసింది. అతి కష్టం మీద దాన్ని ఇంటికి చేర్చింది. దారిలో ఒక రిద్దరు ఆమె వేపు వింతగా చూశారు. "నీ కెందుకు ఈ బాధంతా?" ఆమె మౌనంగా సాగిపోయింది. ఇంటికి తీసికెళ్ళి దెబ్బలకి ఆకు పసరు రాసింది. రెండు రోజులు పట్టింది దూడ లేచి తిరగడానికి. మూడోరోజు దాని యజమాని వచ్చి దాన్ని తోలుకుని వెళ్ళి

పోయాడు, పోతూ, పోతూ వెనుదిరిగి విశాలమైన కళ్ళతో ఆమె వేపు ఒక మారు చూసి వెళ్ళిపోయింది ఆ దూడ.

మరొక రోజు-చాలా రోజులు తరవాత-అలా ఆమె వెళ్తుంటే ఒక పదేళ్ళ కుర్రాడు ఏడుస్తూ కనిపించాడు. "ఎందుకేడుస్తున్నావు?" అని అడిగింది. 'నీకెందుకు?" అన్నాడు ఆ కుర్రాడు "అవును నీ కెందుకు" అంది ఆ కుర్రాడి పక్కనే ఉన్న తల్లి. "ఊరికే అడిగాను" అంది ఆమె మందహాసంతో, ఆ కుర్రాడూ, తల్లీ-ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

"మా యింటికి వస్తావా?" అని అడిగింది, ఆమె. 'సరే'నని ఆ బాలుడు ఆమె ననుసరించాడు, ఇది కొత్త విషయమే అయినా అందరికీ సహజంగానే తోచింది. ఆ కుర్రాడు అలా వరసగా వారం రోజులు ఆగి ఆ యింటికి వెళ్ళాడు. ఒకరోజు అడిగాడు. "ఎందుకిలాగ నన్ను రమ్మంటున్నావు?" అని.

ఆమె సమాధానం చెప్పింది, "నాకు నీలాటి కొడుకు ఒకడు ఉండేవాడు. నిన్ను చూస్తే వాడిని చూసినట్టు ఉంటుంది," అని.

"ఓహో" అన్నాడు అతను సరిగ్గా అర్థం కాకపోయినా.

ఊళ్ళో అందరూ "కొత్తమ్మ కోరుకున్న కొడుకు" అని వాడిని హేళన చేశారు. వాడికి రోషం వచ్చింది వాళ్ళింటికి వెళ్ళడం మానేశాడు. ఆ రాత్రి ఆమె కన్నీటితో కనిపించింది. "మా యింటికి ఎందుకు రాలేదు?" అని అడిగినట్టనిపించింది. లేవగానే పరుగెత్తుకుంటూ అక్కడికి వెళ్ళాడు. ఆమె చెంపను చేయి ఆన్చి దిగంతాలలోకి చూపులు నిగిడ్చి చూస్తూ కూర్చుని వుంది.

"నే నొచ్చానమ్మా" అన్నాడు అబ్బాయి రొప్పుతూ ఉద్వేత్తుగా పొంగుతున్న గుండెల్ని కంఠంలో విశదం చేస్తూ.

ఆమె అతడివేపు తిరిగింది, "ఎందుకొచ్చావ్ ఫో ఫో ఇక్కడేం దాచిపెట్టావా రోజూ రావడానికి. నేనేం నీకు అచ్చున్నా చేసిపెట్టడానికి .... వేలు చూపితే మండ మింగే రకాలు ఛీఛీ ఇంకెప్పుడూ ఈ చాయలకి రాకు ఫో....ఫో...."

ఆ అబ్బాయికి అంతా అయోమయంగా కనిపించింది. ఆమె మాటలు ఏమీ అర్థంకాలేదు, "ఫో." అన్న ఒక్క మాటే తెలిసింది. వాడు గిరుక్కున వెనుదిరిగి వెళ్ళిపోయాడు. దారిలో ఒక చెట్టు కింద కూచుని ఏడిచాడు కొంచెంసేపు. తలెత్తి చూస్తే ఆమె రెండు పూతరేకులు పట్టుకుని నించుని వుంది. "తీసుకో" అంది.

"అక్కర్లేదులే" అంటూ లేచి పరుగెత్తుకుంటా వెళ్ళిపోయాడు,

"పోతేపో బ్రతిమాలితే గీరెక్కువవుతుంది. పుణ్యానికి పుట్టెడు బియ్యం ఇస్తే పిచ్చుకుంచంతో ఇచ్చేవని పోట్లాడిందిట. నేనేమీ ఎవరికీ ఋణపడిలేను" అంటూ గొణుక్కుంటూ ఆమె వెళ్ళిపోయింది.

క్రమంగా ఆమెనిగూర్చి ప్రజలు గుంపులుగా చేరి చెప్పుకోసాగారు. "ఎవరో పోతే మనకేం" అన్నభావం మంచులా విడిపోతోంది. ప్రతి వాళ్ళూ మాట సాయంకావాలనో పని సాయం కావాలనో ఆమె దగ్గిరికి వెళ్తున్నారు. ఒక మంచి పనిచేసి "కాత్తమ్మ" తో గొప్పగా చెప్పుకున్నవాళ్ళు అనేకం ఉన్నారు. ఒకప్పుడు ఆమె హర్షం వెలిబుచ్చుతుంది. ఒకప్పుడు "అదీ ఒక గొప్పేనా?" అని తేల్చిపారేస్తుంది. ఒకప్పుడు అలాకాదు ఇలా చెయ్యాలి" అని చెబుతుంది. ఒకప్పుడు తనే చేసి చూపిస్తుంది.

ఒకమారు పాలమనిషి ఆవు కొమ్ము విసిరితే మంచం పట్టిందని వాళ్ళింట్లోనే వుండి వారంరోజులు సేవ చేసిందిట, రెండోనాడు నారపరాజుగారి చిన్న కోడలు కాస్త నలతగా ఉంది. ఓమా రొచ్చి చూసిపో,' అని కబురు చేస్తే "ఏం కావరం! ఇంటికి రమ్మని కబురు చెయ్యడానికి, రానని చెప్పు," అని కసిరి కొట్టిందిట. అయినా అందరికీ ఆమె అంటే వివరించలేని అపేక్ష భయమూను.

ఒకమారు కాకపోతే ఒకమారైనా ఎక్కువ చనువు చూపగలిగింది అబ్బాయి ఒక్కడే. వాడికి ఆమె కసుర్లూ, విసుర్లూ, ఆగ్రహమూ, అనుగ్రహమూ అన్నీ ఒక్కటే. ఒక్కొక్కమారు వాడికి కోపం వస్తుంది, రోషం వస్తుంది. అన్నీవాడు ఆమెదగ్గిర్నుంచేనేర్చుకున్నాడు

అలాగ రోజులు, వారాలు నెలలుగా, నాలుగు సంవత్సరాలు జారిపోయాయి. అబ్బాయికొంచెంపెద్దవాడయేడు. ఆమెలో కొంచెం వార్ధక్యం కనిపిస్తోంది. ఊరులోకొంచెం ఉత్తేజం కలిగింది....

ఆ రోజు పోలేరమావాస్య. పోలి స్వర్గానికి వెళ్ళిన పర్వదినం, అబ్బాయి అప్పటికి నాలుగురోజులుగా అమ్మ దగ్గరికి వెళ్ళలేదు అలిగి. అదే మరొక సందర్భంలో ఐతే ఆమె స్వయంగా వచ్చి పిలుచుకుని వెళ్ళేది. కాని ఈ మారు అలా రాలేదు. అబ్బాయికి ఓర్పు నశించింది, ఏ విషయం ముఖాముఖి తేల్చుకోవాలనుకున్నాడు. విసురుగా లేచి, నిముషాలమీద ఆమె జీర్ణమందిరం చేరుకున్నాడు. అక్కడ ఆమె ఒంటరిగా లేదు. ఒక బాలుడిని అక్కున చేర్చుకుని లాలిస్తోంది. వెన్నుదురు మృదువుగా చుంబిస్తోంది, చెంపలు నిమురుతోంది....

ఇదంతా యిష్టంలేనట్టు ఒక మధ్య వయస్కుడు వెనుదిరిగి గవాక్షంనుంచి దూరంగా చూస్తున్నాడు. ఆగి ఆగి మాటాడుతున్నాడు" .... "జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు వచ్చెయ్యవమ్మా అంటే నీకెందుకు అభ్యంతరం.. నిన్నేమైనా నేనక్కడ రాళ్ళు మొయ్యమన్నానా?.... అదీ నా కోసం ఐతే నే నంతగా పాకులాడనే ఆడను.... ఆ పసివాడికోసం.... ఇంతకీ మా కంటె, వాడికంటే "పిళ్ళు .... నీకు .... దగ్గిరయేరు.... ఈ నాటికి...." చివరిమాటలు అంటుంటే కంఠం గద్గదమయింది....

"చాల్లేవోయ్. మాటలు నేర్చావ్" ఆమె కసిరింది కాని ఆ స్వరంలో కాఠిన్యం కంటె మార్దవమే హెచ్చు, గెలుపెవరిదో తెలిసిపోయింది....

అబ్బాయి గిరుక్కున వెనక్కి తిరిగాడు. ఝుంఝూ మారుతంలా ఊరివేపు సాగి, దారిలో చెట్టుకింద ఆగాడు. అతని కన్నులలో ఎరుపుజీర మెరుస్తూంది. హృదయం తీవ్రంగా కొట్టుకుంటోంది.. "సరే....సరే...." అనుకుంటూ కదలిపోయాడు. దారిలో అడిగినవాళ్ళకీ, ఆడగనివాళ్ళకీ వివరించి చెప్పాడు. కనిపించనివాళ్ళకి కబురు చేశాడు. కొందరు అతనిని ఓదార్చారు. కొందరు అతనినే చీవాట్లు వేశారు. కొందరు సలహాలు చెప్పారు,

అబ్బాయికి తోచడంలేదు, ఏదో అన్యాయం జరుగుతోంది. ఏమిటో స్పష్టంగా చెప్పలేకపోతున్నాడు,

చెప్పలేక పోతున్నాడు.

తమస్సు కమ్ముకునీ వస్తోంది.

లోకం నిద్ర కౌగిలించింది.

అబ్బాయి లేచాడు.

.... .... ....

"అమ్మా!" చీకట్లు చీల్చుకుని ఒక పసివాడి ఆక్రందనం ప్రతిధ్వనించింది,

జరిగింది తనకి తెలియదని కర్మసాక్షి అప్పుడే ఉదయించాడు.

ఆమె గదిమధ్య నిలబడి ఉంది నిశ్చలంగా, మంచంమీద పసివాడు నీరసంగా పడి ఉన్నాడు.

వాడిని తీసుకొచ్చిన మధ్యవయస్కుడు దూరంగా గోడనానుకునినించుని ఉన్నాడు.

గోడ అవతల అబ్బాయి పశ్చాత్తాపంతో దహించుకుని పోతున్నాడు.

ముగ్గురు మూర్ఖులు ఆమె పాదాలు పట్టకుని వదలడంలేదు. "నువ్వు క్షమించానన్నదాకా మేం వదలం. క్షణికమైన ఆవేశానికి లొంగిపోయాం.... మావంటి పాపాత్ములు లోకంలో ఉండరు. మా పాపానికి ప్రాయశ్చిత్తం ఉండదు.

చెప్పమ్మా ఏ శిక్షయినా అనుభవిస్తాం.... చెప్పుతల్లీ.... నీ కోపాన్ని మాత్రం భరించలేం.... చెప్పు .. చెప్పు.. క్షమించు .. క్షమించు ..."

ఆమె వాళ్ళవేపు చూసింది. వీరిని ఈ స్థితికి తెచ్చిందెవరు.... ....

మంచంమీద పసివాని వైపు చూసింది. "నా కెందుకీ శిక్ష అని ప్రశ్నిస్తున్నట్టనిపించింది....

కనురెప్పలు బరువుగా కదల్చి కుడివేపు గోడదగ్గరికి దృష్టి మరల్చింది. "ఇప్పుడేం చెయ్యగలవు?" అని నిందిస్తున్నాడు మౌనంగానే.

కనులు మూసుకుంది. మనోఫలకం పైన అబ్బాయి చిత్తరువు అస్పష్టంగా కదిలింది, పెదవులు కదిలేయ్ భగవాన్!....

మామే స్త్రీత్వం....

మా మూర్ఖత్వం....

మిధ్యాదృష్టిర్మా ....

జాతా జాతా ....

మా స్త్రీత్వం...మామే స్త్రీత్వం...

మా ..

—